


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
24-02-2026
పేజీలు: 02



## ట్రంప్ హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య ఒప్పందాల విషయంలో వెనక్కి తగ్గే దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందాల నుండి ఏ దేశమైనా తప్పుకోవాలని చూస్తే, గతంలో కంటే భారీ స్థాయిలో సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తన అత్యవసర సుంకాలను కొట్టివేసిన నేపథ్యంలో, ఇతర వాణిజ్య చట్టాల ద్వారా మరింత కఠినమైన నిర్ణయాలు తీసుకుంటానని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అమెరికాను దశాబ్దాలుగా మోసం చేస్తున్న దేశాలు ఆటలు సాగనివ్వబోమని, అలాంటి వారిపై భారీ టారిఫ్లతో పాటు లైసెన్స్ ఫీజులను కూడా విధించే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్లు అనిశ్చితికి లోనై స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. మరోవైపు బ్రస్సెల్స్‌లో యూరోపియన్ పార్లమెంట్ అమెరికాతో జరగాల్సిన వాణిజ్య ఒప్పందంపై ఓటింగ్‌ను వాయిదా వేసింది. అన్ని దేశాల నుండి వచ్చే దిగుమతులపై ట్రంప్ 15 శాతం తాత్కాలిక దిగుమతి సుంకాన్ని విధించడమే దీనికి ప్రధాన కారణం.

## ఒకే ఫ్యామిలీలో ముగ్గురు సూసైడ్

హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను రామ్‌రాజ్ (55) మాధవి (50), శశాంక్ (24)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో పరిసరాలను పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న రామ్‌రాజ్ సన్నిహితులు ఇంటికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# ఖమ్మంలో టెన్షన్ టెన్షన్

## తెల్లారకముందే జేసీబీలు, డోజర్లతో వచ్చి.. ఇళ్లను కూల్చేశారు..

ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో ఆక్రమణల తొలగింపుతో ఉద్రిక్తత నెలకొంది. వెలుగుమట్ల, వినోబానగర్‌లోని భూదాన్ భూముల్లో నిర్మించిన ఇండ్లను పోలీసుల సమక్షంలో భారీ భద్రత నడుమ కూల్చి వేస్తున్నారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది పోలీసుల మోహరించారు. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట్, కొత్తగూడెం నుంచి అదనపు బలగాలు నగరానికి చేరుకున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ఈ నిర్మాణాలు జరిగాయి. సర్వే నంబర్లు 147, 148, 149లో 60 ఎకరాల భూ దాన్ భూములు ఉండేవి. వీటిలో 30 ఎకరాల్లో 2018లో కొంతమంది ఇండ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి పలువురు వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. పిటిషన్లు దాఖలు చేసిన వారిని మినహాయించి, మిగతా నిర్మాణాలు తొలగించాలన్న కోర్టు ఆదేశాల అనంతరం ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పోలీసులు జేసీబీలు తీసుకొచ్చి నిర్మాణాలను తొలగిస్తున్నారు. ముందస్తుగా ఇళ్లల్లో ఉన్న సామాన్లను తొలగించారు. పలువురు జేసీబీలను అడ్డుకుంటున్నారు. కర్రలతో పోలీసులపై తిరగబడుతున్నారు. కోర్ట్ కేసులో ఉన్న 8 ఇండ్లను మినహాయించి మిగతా వాలటన్నింటినీ తొలగిస్తామని పోలీసులు చెప్తున్నారు. స్థానికంగా 200కు పైగా ఇండ్ల నిర్మాణం జరిగింది. వీటిలో చిన్న రేకుల షెడ్లు మొదలుకొని పెద్ద పెద్ద భవనాలు కూడా ఉన్నాయి. ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పోలీసులు నిర్మాణాల తొలగింపు ఎలా చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.



దేశంలోనే తొలిసారి.. మీ ఇంటి వద్దకే

## రైల్వే పార్సిల్ సేవలు!

దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులతో పాటు వినియోగదారులకు మరింత చేరువయ్యేలా వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'రైల్ పార్సిల్ యాప్'ను ప్రవేశపెడుతూ, డోర్ టు డోర్ పార్సిల్ బుకింగ్ మరియు డెలివరీ సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఈ సరికొత్త విధానం ద్వారా రైల్వే రంగంలో డిజిటల్ సేవల వినియోగం పెరగడమే కాకుండా, సాధారణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రేపు హైదరాబాద్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సేవలో భాగంగా రైల్వే సిబ్బంది స్వయంగా వినియోగదారుల ఇళ్లకు చేరుకుని పార్సిళ్లను సేకరిస్తారు, అలాగే గమ్యస్థానాలకు చేరిన వస్తువులను నేరుగా ఇంటికే డెలివరీ చేస్తారు. దీనివల్ల వినియోగదారులు పార్సిల్ బుకింగ్ కోసం రైల్వే స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు, సమయం మరియు శ్రమ రెండూ ఆదా అవుతాయి. రైల్వే శాఖ అందిస్తున్న ఈ సేవల నిర్వహణను అత్యంత సమర్థవంతంగా అమలు చేసేందుకు మరియు లాజిస్టిక్స్ మార్కెట్‌పై లోతైన అధ్యయనం చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరుతో ఒప్పందం చేసుకోనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ వ్యూహాలను రూపొందించడం మరియు రవాణా రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం సులభం కానుంది. తొలుత హైదరాబాద్ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా మొదలయ్యే ఈ 'రైల్ పార్సిల్ యాప్' సేవలు, అక్కడ వచ్చే స్పందనను బట్టి మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరించాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. పెరుగుతున్న ఇ-కామర్స్ ట్రెండ్‌కు పోటీగా రైల్వే తన నెట్‌వర్క్‌ను ఆధునీకరించుకోవడం శుభపరిణామమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ వినూత్న ప్రయోగం సక్సెస్ అయితే, భవిష్యత్తులో సరుకు రవాణా రంగంలో భారతీయ రైల్వే తిరుగులేని శక్తిగా అవతరించే అవకాశం ఉంది.

## మే 15న మా ఇంటి బంగారం విడుదల




ప్రముఖ నటి సమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఖరారైంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని సమంత స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.కొత్త పోస్టర్‌లో సమంత ఓ తలుపు చాటు నుంచి ఆసక్తిగా తొంగిచూస్తూ కనిపించారు. ఈ పోస్టర్‌ను పంచుకుంటూ ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం, బంగారాలు.. మే 15న 'మా ఇంటి బంగారం' ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుద లవుతోంది అని ఆమె క్యాప్షన్ జోడించారు. నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను జనవరిలో విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. బస్సులో బ్రౌన్ కలర్ చీరలో నిలబడి, పోరాటానికి సిద్ధమైనట్లుగా ఉన్న సమంత లుక్ సినిమాపై అంచనాలను పెంచింది.ఈ సినిమా గురించి సమంత మాట్లాడుతూ ఇది కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చే ఎమోషనల్ కథ.

## గుజరాత్‌లో ప్రేమ వివాహాలకు కొత్త నిబంధన



గుజరాత్‌లో ప్రేమ వివాహం చేసుకోవాలనుకునే జంటలకు రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలంటే ఇకపై తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి ఉండాలనే నిబంధనను తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మేరకు 'వివాహ రిజిస్ట్రేషన్ చట్టం'లో మార్పులు చేయనుంది. ఇది అమల్లోకి వస్తే, తల్లిదండ్రులకు తెలియకుండా పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదు. ప్రతిపాదిత సవరణల ప్రకారం పెళ్లి చేసుకునే జంట తమ తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పారో, లేదో దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలి. దరఖాస్తు అందిన 10 రోజుల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వయంగా వధూవరుల తల్లిదండ్రులకు నోటీసులు పంపుతారు. దరఖాస్తుతో పాటు తల్లిదండ్రుల ఆధార్ వివరాలు కూడా జతచేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన 30 రోజుల తర్వాతే వివాహ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.ఈ నిబంధనల వెనుక ఉన్న ఉద్దేశాన్ని రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘ్వీ అసెంబ్లీలో వివరించారు.ప్రేమ పేరుతో జరిగే మోసాలను అరికట్టడం, అమాయక యువతులు 'లవ్ జిహాద్' బారిన పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం. మోసపూరిత వివాహాలు సామాజిక వ్యవస్థను చెదపురుగుల్లా నాశనం చేస్తున్నాయి అని ఆయన వ్యాఖ్యానించారు.అయితే, ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని, న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో 'హాదియా కేసు'లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వారు గుర్తుచేస్తున్నారు. నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం అనేది ప్రాథమిక హక్కు అని, ఇందులో తల్లిదండ్రులు గానీ, ప్రభుత్వం గానీ జోక్యం చేసుకోరాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కొత్త రూల్స్ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తాయని సోషల్ మీడియాలోనూ విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుతం ఈ నిబంధనలు కేవలం ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం 30 రోజుల పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించనుంది. అనంతరం తుది నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చితే, దీనిని కోర్టులో సవాలు చేసే అవకాశాలున్నాయి.

## చాడీలు చెబితే రూ.5 వేలు ఫైన్.. ఛత్తీస్ గఢ్ గ్రామస్థుల తీర్మానం




ఒకరిపై మరొకరు చాడీలు చెప్పడం, వదంతులు (గాసిప్స్) వ్యాప్తి చేయడం వంటివి పల్లెల్లో సాధారణమే. ఈ 'చాడీల' వల్లే ఊర్లో అనవసరపు గొడవలు, మనస్పర్థలు పెరుగుతున్నాయని ఛత్తీస్ గఢ్ లోని బలోద్ జిల్లా మేదకీ గ్రామస్థులు భావించారు. అందుకే, ఈ గాసిప్‌లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించి ఒక కఠినమైన నిబంధన పెట్టుకున్నారు. గ్రామంలో ఎవరైనా ఒకరిపై మరొకరికి చాడీలు చెప్పినా లేదా అసత్య ప్రచారాలు చేసినా రూ.5,000 జరిమానా విధించాలని గ్రామ కమిటీ తీర్మానించింది. సోషల్ మీడియా ద్వారా అసత్య వార్తలు వ్యాప్తి చేసినా ఈ జరిమానా వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఎవరైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు సాక్ష్యాధారాలతో గ్రామ కమిటీకి ఫిర్యాదు చేస్తే వారికి రూ.1,000 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపింది. గ్రామ కమిటీ అంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల గ్రామంలో శాంతి, సామరస్యం పెరుగుతాయని వారు నమ్ముతున్నారు. మేదకీ గ్రామం ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఇదే మొదటిసారి కాదు. గత ఐదేళ్లుగా గ్రామాన్ని క్రమశిక్షణలో ఉంచేందుకు కొన్ని నిబంధనలు పాటిస్తున్నారు. ఊర్లో ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.10,000 జరిమానా, బహిరంగ ప్రదేశాల్లో తాగి గొడవ చేస్తే రూ.11,000 ఫైన్, గ్రామసభల్లో లేదా పబ్లిక్ ప్లేస్‌లలో అనుచిత పదజాలం వాడితే కూడా జరిమానాలు విధిస్తున్నారు. ''చిన్న చిన్న మాటలను పెద్దవి చేసి గ్రామ వాతావరణాన్ని పాడు చేసే 'చుగ్లీ' (చాడీల) సంస్కృతిని అంతం చేయడమే మా లక్ష్యం. దీనివల్ల ప్రజల మధ్య పరస్పర నమ్మకం పెరుగుతుంది'' అని గ్రామ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# మూడో ప్రపంచ యుద్ధం మొదలైపోయింది

**ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ**




ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరో కీలక మలుపు తిరిగింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదిస్తున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. కీవ్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయంలో జరిగిన తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. పుతిన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ప్రపంచం ఇప్పటికే మూడో ప్రపంచ యుద్ధంలోకి అడుగు పెట్టిందని.. దీనిని అడ్డుకోవడానికి పుతిన్‌పై ప్రపంచ దేశాలు సైనిక, ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచాలని పిలుపునిచ్చారు.

**శాంతి కోసం భూభాగాలను వదులుకోం!**

రష్యా ఆక్రమించిన ప్రాంతాలతో పాటు ప్రస్తుతం ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న డోనెట్స్క్, ఖేర్సన్, జపోరిజ్జియాలోని మరికొన్ని వ్యూహాత్మక ప్రాంతాలను వదులుకోవాలనే పుతిన్ డిమాండ్‌ను జెలెన్స్కీ తప్పుబట్టారు. "నేను దీనిని కేవలం భూమిగా చూడటం లేదు.. ఇది ఒక పరిత్యాగం. ఆ ప్రాంతాల నుంచి మా దళాలను ఉపసంహరించుకోవడం అంటే మా రక్షణ వ్యవస్థను బలహీన పరుచుకోవడమే. అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది మా పౌరులను శత్రువుల పాలు చేసి.. వారిని వదిలేయడమే అవుతుంది. ఇది మా సమాజాన్ని చీలుస్తుంది" అని జెలెన్స్కీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇదీ చూడండి: ఉక్రెయిన్ ఉన్నతాధికారుల హత్యకు రష్యా భారీ కుట్ర.. ఒక్కొక్కరి తలపై రూ.10 లక్షల సుపారీ

**పుతిన్‌కు కావాల్సింది విరామం మాత్రమే!**

ఒకవేళ భూభాగాలను వదులుకుంటే పుతిన్ సంతృప్తి చెందుతారా? అన్న ప్రశ్నకు జెలెన్స్కీ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. పుతిన్ ఇప్పుడు కాల్పుల విరమణ కోరుకుంటున్నది కేవలం తన దళాలు తిరిగి పుంజుకోవడానికి మాత్రమేనని జెలెన్స్కీ విశ్లేషించారు. ఐరోపా భాగస్వాములు పుతిన్ కోలుకోవడానికి 3 నుంచి 5 ఏళ్లు పడుతుందని భావిస్తున్నప్పటికీ.. ఆయన కేవలం రెండేళ్లలోనే మళ్లీ సిద్ధమవుతారని హెచ్చరించారు. ఆ తర్వాత ఆయన తదుపరి లక్ష్యం ఏ దేశం అవుతుందో ఎవరికీ తెలియదని.. కానీ యుద్ధాన్ని కొనసాగించడమే పుతిన్ నైజమని స్పష్టం చేశారు.

**ప్రపంచానికి జెలెన్స్కీ హెచ్చరిక..**

రష్యా.. ప్రపంచంపై తనదైన జీవన శైలిని రుద్దాలని చూస్తోందని, స్వేచ్ఛా యుత ప్రపంచాన్ని మార్చడమే పుతిన్ లక్ష్యమని జెలెన్స్కీ పేర్కొ న్నారు. అందుకే ఆయన్ను వెనక్కి తగ్గించేలా అంతర్జాతీయ సమాజం ఉమ్మడి పోరాటం చేయాలని కోరా రు. ఉక్రె యిన్ ఓడిపోవడం లేదని, అంతి మంగా విజయం తమనే వరి స్తుం దని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# తడిసి ముద్దయిన మిర్చి.. కన్నీరుమున్నీరవుతున్న రైతన్న!



ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం మిర్చి సాగు చేసిన రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు, వివిధ గ్రామాల్లోని కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట ఒక్కసారిగా కురిసిన వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురవడంతో, పంటను కాపాడుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఏడాది పొడవునా రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట ఇలా నీటిపాలవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఏడాది సాగు ప్రారంభం నుండి మిర్చి దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం. తెగుళ్ల బెడద, పెరిగిన పెట్టుబడి వ్యయంతో ఇప్పటికే సతమతమవుతున్న రైతులకు, ఈ అకాల వర్షం కోలుకోలేని దెబ్బ తీసింది. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, కనీసం కూలీల ఖర్చులు కూడా వెళ్లదీయడం కష్టమని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన మిర్చి వర్షానికి రంగు మారిపోవడంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించదని వారు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడం మరియు పంటను కప్పుకోవడానికి అవసరమైన టార్పాలిన్ పట్టాలు అందుబాటులో లేకపోవడం వల్ల నష్టం తీవ్రత మరింత పెరిగింది. మార్కెట్ యార్డుల్లో తగినన్ని షెడ్లు లేకపోవడంతో రైతులు ఆరుబయటే పంటను ఆరబోశారు. ఒక్కసారిగా వర్షం పడటంతో పట్టాలు లేక, ఉన్నా అవి సరిపోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రభుత్వం ముందుగానే స్పందించి రైతులకు అవసరమైన టార్పాలిన్లను పంపిణీ చేయాల్సి ఉందని క్షేత్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. తీవ్ర నష్టాల్లో ఉన్న తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏన్కూర్ మండల రైతాంగం వేడుకుంటోంది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించి, వర్షం వల్ల దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేయాలని వారు కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించి, ఈ విపత్కర పరిస్థితుల్లో అండగా నిలవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే తాము మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రామ్ చరణ్‌పై ట్రోలింగ్.. దిమ్మతిరిగే క్లారిటీ ఇచ్చిన అల్లు శిరీశ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అంటే కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, నిష్ఠతో కూడిన జీవనశైలికి ఆయన ఒక మారుపేరు. అయితే ఇటీవల అల్లు శిరీశ్ పెళ్లి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక పార్టీకి సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో, సోషల్ మీడియాలో చరణ్‌పై ఊహించని విమర్శలు వ్యక్తమయ్యాయి. అయ్యప్ప స్వామి మాలలో ఉండి పార్టీకి ఎలా హాజరవుతారంటూ కొందరు నెటిజన్లు నెగిటివ్ కామెంట్లతో విరుచుకుపడ్డారు. మాలను అవమానించారంటూ సాగిన ఈ ట్రోలింగ్‌పై తాజాగా అల్లు శిరీశ్ స్పందిస్తూ, విమర్శకుల నోళ్లు మూయించేలా అసలు విషయం వెల్లడించారు. రామ్ చరణ్‌తో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేస్తూ.. ఆ రోజు అసలేం జరిగిందో శిరీశ్ వివరంగా చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఆ పార్టీ ఇంకా ప్రారంభం కాకముందే చరణ్ అక్కడికి చేరుకున్నారని, కేవలం విష్ చేయడానికి మాత్రమే ఆయన వచ్చారని క్లారిటీ ఇచ్చారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ మద్యం సేవించలేదని, చరణ్ కూడా అతిథిగా వచ్చి శుభాకాంక్షలు తెలిపి వెంటనే అక్కడి నుండి వెళ్లిపోయారని వివరించారు. అయ్యప్ప స్వామి అంటే చరణ్‌కు ఉన్న భక్తి శ్రద్ధలు వెలకట్టలేనివని, అటువంటి వ్యక్తి ఎప్పుడూ మతపరమైన ఆచారాలకు భంగం కలిగించరని అన్నారు.



## వెలగపూడిలో మంత్రి లోకేష్‌తో శ్రీశైలం అభివృద్ధి చర్చ



మంగళవారం, వెలగపూడి క్యాంప్ కార్యాలయంలో హెచ్ఆర్‌డీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. అనంతరం, శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాద కిట్‌ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు.

## కోట్ల విలువైన ఆస్తులు ఉన్న హీరోయిన్


**అనన్య పాండే ఫిల్మీ బ్యాగ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ నుంచి వచ్చింది. ఆమె తండ్రి చుంకీ పాండే బాలీవుడ్ లో ప్రముఖ నటుడు. అనన్య పాండే స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 తో నటిగా బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. కానీ ఆమెకి ఎక్కువగా సక్సెస్ ఫుల్ చిత్రాలు లేవు.కానీ ఆమెకి ఆస్తులు మాత్రం స్టార్ నటీమణుల రేంజ్ లో ఉన్నాయి. ముంబైలో సొంత అపార్ట్‌మెంట్ కొనడం అనన్య కెరీర్‌లో పెద్ద మైలురాయి. గౌరీ ఖాన్ డిజైన్ చేసిన ఈ ఇల్లు ఆమె అభిరుచికి అద్దం పడుతుంది. 26 ఏళ్లకే సొంతిల్లు ఆమె విజయాన్ని చూపిస్తుంది.**

# విగ్రహం కోసం ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దు

## గాంధీ మనవడు తుషార్



హైదరాబాద్‌లో మహాత్మా గాంధీ విగ్రహ నిర్మాణం కోసం జరుగుతున్న భూసేకరణపై ఆయన ముని మనవడు తుషార్ గాంధీ స్పందించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ విగ్రహం కోసం స్థానిక ప్రజలను వారి నివాసాల నుంచి తరలించడం గాంధీ విధానాలకు వ్యతిరేకమని తుషార్ అన్నారు. దయచేసి అలాంటి చర్యలు చేపట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బాపు జీవించి ఉంటే నా పేరుతో ఇలా చేయొద్దు, వెంటనే ఆపేయండి అని చెప్పేవారని పేర్కొన్నారు. గాంధీజీ ఆలోచనలు అహింస, సామరస్యానికి ప్రతీకలని, ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడటమే ఆయన సిద్ధాంతమని తుషార్ గాంధీ గుర్తు చేశారు. ఆయన పేరుతో ప్రజలను ఇళ్ల నుంచి వెళ్లగొట్టడం ఆయన ఆలోచనలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.




## నేడు జయలలిత జయంతి.. స్పెషల్ వీడియో షేర్ చేసిన మోడీ!

నేడు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆమెను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ట్రిబ్యూట్ టు అమ్మ జయలలిత జీ అంటూ ఓ స్పెషల్ వీడియో షేర్ చేస్తూ ఆమె సేవలను కొనియాడారు. జయలలిత ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న దమ్మున్న నాయకురాలు అని, గొప్ప పరిపాలకురాలని ప్రధాని పేర్కొన్నారు. జయలలిత జీవిత ప్రయాణం ధైర్యం, సంకల్ప బలంతో నిండినదని అభివర్ణించారు. ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పరిపాలన అందించారని మోడీ గుర్తు చేశారు. ఆమె నిర్ణయాల్లో ఖచ్చితత్వం ఉండేదని, అలాగే ప్రజల పట్ల అపారమైన కరుణ కలిగిన నాయకురాలని తెలిపారు. తనకు జయలలితతో జరిగిన సమావేశాలను స్మరించుకుంటూ, ఆ జ్ఞాపకాలు తనకు ఎంతో ఆనందాన్నిస్తాయని తెలిపారు.



## ఆదాయంలో దూసుకుపోతున్న తేజస్ ఎక్స్‌ప్రెస్

భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ రైలు, తేజస్ ఎక్స్‌ప్రెస్, ప్రయాణికుల సంఖ్య ఆదాయ పనితీరుతో మరోసారి వార్తల్లో నిలిచింది. 2019లో ప్రారంభమైన ఈ రైలు, న్యూఢిల్లీ-లక్నో, అహ్మదాబాద్-ముంబై మార్గాలలో నడుస్తోంది. రైల్వే డేటా ప్రకారం, న్యూఢిల్లీ-లక్నో తేజస్ ఎక్స్‌ప్రెస్ కార్యకలాపాలు ప్రారంభించిన ఒక నెలలోనే సుమారు రూ.7.73 లక్షల ఆదాయాన్ని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) తేజస్ రైళ్లు సుమారు రూ.50 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఢిల్లీ-లక్నో మార్గంలో 69% ఆక్యుపెన్సీ రేటు ఉండగా, అహ్మదాబాద్-ముంబై మార్గంలో 109% ఆక్యుపెన్సీ నమోదైంది.

## ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ.. మాజీ వార్డు మెంబర్ హత్య..!

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరణ్ కోట్ గ్రామంలో అనుమానం పెనుభూతమై ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ ఓ వ్యక్తి దారుణ హత్యకు దారి తీసింది. మాజీ వార్డు సభ్యుడు సాయిలు, టైలర్ బాలు మధ్య గత ఏడాది క్రితం నుండి సాయిలు తమ కుటుంబంపై చేతబడి చేస్తున్నాడని బాలు అనుమానించాడు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. తాజాగా, బాలు ఇంటికి వెళ్లిన సాయిలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో, బాలు కత్తితో సాయిలు గొంతు కోసి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నారు.



## ఝార్ఖండ్‌లో కుప్పకూలిన రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ విమానం



ఝార్ఖండ్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఏడుగురు ప్రయాణికులతో రాంచీ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ అంబులెన్స్ చత్రా జిల్లాలో కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఏడుగురూ మరణించినట్లు అధికారులు తెలిపారు. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ C90 ఎయిర్ అంబులెన్స్ నిన్న రాత్రి 7:11 గంటలకు రాంచీ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయింది. తీవ్ర గాయాలపాలైన సంజయ్ కుమార్ అనే రోగికి మెరుగైన చికిత్స అందించేందుకు ఢిల్లీకి తరలిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. టేకాఫ్ అయిన సుమారు 20 నిమిషాల తర్వాత, వాతావరణం అనుకూలంగా లేనందున మార్గాన్ని మళ్లించాలని పైలట్ కోరినట్లు, ఆ తర్వాత విమానంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లు, రోగి, ఒక డాక్టర్, పారామెడిక్, ఇద్దరు సహాయకులు సహా మొత్తం ఏడుగురూ మరణించినట్లు చత్రా డిప్యూటీ కమిషనర్ కీర్తిశ్రీ జి వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్యపై భిన్నమైన కథనాలు వెలువడుతున్నాయి.